క్లుప్తంగా

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ ప్రదానం



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న హరిబాబుకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. కెమిస్ట్రీలో వివిధ అంశాలపై పరిశోధనలు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్‌బాషాతో పాటు అధ్యాపకులు శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రమోహన్, వెంకటేశం, భాస్కర్, ఏఓ మక్బూల్ తదితరులు ఉన్నారు.

విరాళాల సేకరణ



ధరూరు: భారీ వర్షాలతో అతలాకుతలమైన కేరళ బాధితుల సహాయార్థం శనివారం మండల కేంద్రంలో సీపీఎం నాయకులు ఉప్పేరు నర్సింహ, నర్సింహులు, దేవదాసు ఆధ్వర్యంలో దుకాణ సముదాయాల వద్ద విరాళాలు సేకరించారు. విపత్తుల సమయాల్లో ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్న కేరళ ప్రజలకు మానవతా దృక్పథంతో సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో కుర్వ గోవిందు, తిమ్మప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా బాధ్యతలు



ఖాజామొయినుద్దీన్

రాజోళి: మండల ఎఫ్ఏసీ ఎంపీడీఓగా ఖాజా మొయినుద్దీన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓగా పనిచేసిన రమేష్‌కుమార్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఖాజమొయినుద్దీన్ బాధ్యతలు స్వీకరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ఉండవెల్లి: మండల కేంద్రానికి చెందిన సవారన్న (70) శనివారం చికిత్స పొందుతూ కర్నూల్ ఆస్పత్రిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గత నెల 27న ప్రమాదవశాత్తు కారు తగిలి గాయపడడంతో కర్నూల్‌లో చికిత్స పొందుతున్నాడు. శనివారం మృతి చెందగా భార్య లక్ష్మిదేవి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆదర్శంగా అంగన్‌వాడీ కేంద్రం



ఉండవెల్లి: మండలంలోని బస్వాపురంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి వాల్ పెయింటింగ్ వేయించి ఆదర్శంగా తీర్చిదిద్దారని సీడీపీఓ సుజాత తెలిపారు. శనివారం ఆమె కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే పుల్లూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పలు సూచనలను, సలహాలను అందజేశారు.

నత్తనడకన అప్రోచ్ రోడ్డు పనులు

అయిజ: మున్సిపాలిటీలోని పాతబస్టాండ్–కొత్త బ స్టాండ్‌ల మధ్య పెద్దవాగుపై గతేడాది ప్రారంభించిన బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. బ్రి డ్జి పనులు పూర్తయినా నాలుగు నెలలపాటు అప్రో చ్ రోడ్డు పనులు ప్రారంభించలేదు. ప్రజలు, వివిధ సంఘాల నాయకుల నిరసనల వల్ల రెండు నెలల క్రితం పనుల్లో కదలిక ఏర్పడింది. వారం రోజుల నుంచి అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులు వేగం పుంజుకుంది. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ చేరుకోవడానికి డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. ప్రజలు అంబేద్కర్ చౌక్‌లోని రోడ్డుపై వెళ్తున్నారు. ఇరుకైన రోడ్డు కావడంతో నివాస గృహాల మధ్య ట్రాఫిక్ జామ్ అవుతోంది. అప్రోచ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నీ తోడై నేనుంటా..

భర్త కష్టంలో భార్య తోడుగా నిలిచింది. మిరప పంటలో కలుపు తీతకు కూలీల కొరతను అధిగమించేందుకు భర్తతో కలిసి నడుం బిగించింది. మానవపాడు సమీపంలో రైతు మద్దిలేటి దంపతులు దెంత కొడుతున్న దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– మానవపాడు



పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలి



అలంపూర్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సరస్వతి

అలంపూర్: మున్సిపాలిటీల్లో స్వచ్ఛదనం పచ్చదనం విజయవంతం చేద్దామని మున్సిపల్ కమిషనర్ సరస్వతి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, కమిషనర్, కౌన్సిలర్లు, సిబ్బంది హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ.. వార్డుల్లో 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి వార్డులో ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రత్యేక అధికారులు, మెప్మా, అంగన్‌వాడీ, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పని చేయనున్నట్లు తెలిపారు.

శాంతినగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. వడ్డేపల్లి మండల అధికారుల సమావేశం స్థానిక ఐకేపీ భవనంలో శనివారం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటుచేసి అందరిని కార్యక్రమంలో భాగస్వాములను చేసి విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ప్రత్యేకాధికారులు, ఏపీఎం, ఏపీఓ, కార్యదర్శులు పాల్గొన్నారు.

మానవపాడు: ఐదురోజుల పాటు పక్కా కార్యచరణతో నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి గోవింద్‌నాయక్ తెలిపారు. శనివారం మండలకేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ భాస్కర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెలు పచ్చదనంతో కళకళలాడేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మణ్ అన్నారు. శనివారం ఇటిక్యాల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం–పచ్చదనంపై ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో రోజు వారీగా కార్యక్రమాన్ని చేపట్టి పల్లెలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటుగా విరివిగా మొక్కలు నాటి విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ అశోక్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీసాగర్, ఏపీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: స్వచ్ఛదనం, పచ్చదనం పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి అక్బర్ హాజరై మాట్లాడుతూ.. తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, డ్రైనేజీలు, నీటి నిల్వనీటి ప్రాంతాలను శుభ్రం చేసి గుంతలను పూడ్చడం, సీజనల్ వ్యాధుల నియంత్రణ చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ కృష్ణమోహన్, ఏపీఓ అనిల్‌కుమార్, ఖయ్యుం పాల్గొన్నారు.

అయిజ: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేద్దామని డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీఓ వెకంటయ్య ఎంపీఓ మహేష్‌తో కలిసి జిల్లా స్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతోపాటు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందిన ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ సంజయ్ కుమార్ చిత్రపటంకు ఎంపీడీఓ, సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

గట్టు: మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్యేక అధికారి ప్రియాంక, ఎంపీడీఓ చెన్నయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలను నాటాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ రవికుమార్, ప్రత్యేక అధికారులు, ఎంపీఎం సాంబశివుడు, ఏపీఓ స్వామి, కార్యదర్శులు పాల్గొన్నారు.



వడ్డేపల్లిలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ రామకృష్ణ



మానవపాడులో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి గోవింద్‌నాయక్



కేటీదొడ్డిలో మాట్లాడుతున్న అధికారులు



అయిజలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు

పైపులైన్ కోసం తవ్వి వదిలేశారు!



సంగమేశ్వర ఆలయ సమీపంలో గుంత

అలంపూర్ రూరల్: పట్టణంలోని సంగమేశ్వర ఆలయ సమీపంలో రోడ్డు పక్కన పైపులైన్ మరమ్మతుల కోసం గుంతను తవ్వి పూడ్చకుండా వదిలేశారు. గతంలో తాండ్రపాడు నీటిట్యాంకు ద్వారా వస్తున్న నీటి పైపులను తొలగించి అలంపూర్ నది నీటిని కలిపేందుకు మరమ్మతుల కోసం గుంతను తీసి రెండు వారాలు గడుస్తున్న పనుల్లో జాప్యం జరుగుతుంది. మిషన్‌భగీరథ నీటి సమస్య ఉత్పన్నమయితే తాత్కాలికంగా నీటి సమస్య రాకుండా తుంగభద్ర నది నుంచి నీళ్లు వచ్చేందుకు పనులు చేస్తున్నారు. నిత్యం వాహనాలు, ప్రజలు తిరిగే స్థలంలో పెద్ద గుంతను తీయడంతో రాత్రి వేళలో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారుల స్పందించి గుంతను పూడ్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సెల్‌ఫోన్ అందజేత

గద్వాల క్రైం: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి పోలీసులు అందించారు. శనివారం ఉదయం రాజీవ్‌మార్గ్ రోడ్డు మార్గంలో రాముడు బైక్‌పై వెళ్తూ తన ఫోన్ పడగొట్టుకున్నాడు. విధులు నిర్వహిస్తున్న హోం గార్డు విష్ణు గుర్తించి ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడికి అందజేశాడు. వ్యక్తిని గుర్తించి పోలీసులు తిరిగి ఫోన్‌ను అందజేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: పోగొట్టుకున్న ఫోన్ శనివారం రికవరీ చేసి అందజేశారు. ఆంధ్రాకు చెందిన శరన్‌కుమార్ ఇటీవల తన ఫోన్ పోగొట్టుకుపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దానిని గుర్తించి బాధితుడికి అందజేసినట్లు ఎస్ఐ స్వాతి తెలిపారు.

నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

గద్వాల అర్బన్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి విస్మరించిన రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్‌లో నిరుద్యోగులతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఎన్ని పోస్టులు ఉన్నాయో చెప్పకుండా జాబ్ క్యాలెండర్ ప్రకటించడం నిరుద్యోగులపై ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్‌కు మొదటి క్యాబినెట్‌లోనే చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. తక్షణమే జాబ్ క్యాలెండర్‌ను రద్దు చేసి పోస్టుల సంఖ్యను స్పష్టంగా తెలిపి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాల్, మాధవ్, రాజశేఖర్, పరశురాములు, నరేష్ తదితరులు ఉన్నారు.

స్పష్టత లేకుండా జాబ్‌క్యాలెండర్

ఏ శాఖలో ఎన్ని ఖాళీలను భర్తీ చేయబోతున్నారనే అంశంపై స్పష్టత లేకుండానే ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం సరికాదని బీఆర్‌ఎస్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌లో పరీక్షల తేదీలు తప్ప మరేమీ కనిపించడం లేదని విమర్శించారు.

జిల్లా సంక్షేమశాఖ అధికారి బదిలీ



గద్వాల అర్బన్: జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి, బీసీ ఇన్‌చార్జి సంక్షేమ శాఖ అధికారిగా విధులు నిర్వహించిన శ్వేతా ప్రియదర్శిని హైదరాబాద్‌లోని మహాత్మ జ్యోతి రావు పూలే రెసిడెన్షియల్స్ సంబంధించిన స్టేట్ హెడ్ ఆఫీసులో అసిస్టెంట్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. ఈసందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల వసతిగృహంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. హాస్టళ్ల వార్డెన్లు, సిబ్బంది తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఇదిలా ఉండగా.. ఏఎస్‌డబ్ల్యూగా సరోజను జిల్లా ఇన్‌చార్జి ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిగా నియమితులయ్యారు. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌బాబు ఇన్‌చార్జి బీసీ సంక్షేమశాఖ అధికారిగా నియమితులయ్యారు.

అర్చకుల కమిటీ ఏర్పాటు

అయిజ: మండల కేంద్రంలో శనివారం దూప దీప నైవేద్య అర్చకులు నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి హాజరయ్యారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా అడవి స్వామి, ఉపాధ్యక్షుడిగా రవి, గౌరవ అధ్యక్షుడిగా బాబారావు, గౌరవ సలహాదారులుగా రఘుస్వామి, గురు బసవయ్య, సంయుక్త కార్యదర్శిగా బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా కృష్ణయ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కమిటి సభ్యులను పూలమాలలతో సత్కరించారు.

కొత్త చట్టాలపై అవగాహన



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో కొత్త చట్టాలపై ఎస్ఐ శ్రీనివాసులు శనివారం అవగాహన కల్పించారు. గ్రామంలో సీసీ కెమరాలను ఏర్పాటు చేసుకోవాలని, సైబర్ క్రైం నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

వెనుకబడిన వర్గాలకు అండగా కాంగ్రెస్



గద్వాల అర్బన్: వెనుకబడిన వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలోని విగ్రహానికి ఆమె పాలాభిషేకం చేసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పును కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందన్నారు. పదేళ్లుగా ఎస్సీ వర్గీకరణకు బీజేపీ అడ్డుపడిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేపడుతామని హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ ఫలాలు అందరికి దక్కే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, ఇసాక్, మధుసుదన్ బాబు, వెంకట్రామిరెడ్డి, కోటేష్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు బలం



కేటీదొడ్డిలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గద్వాల అర్బన్: పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు తల్లిపాలు ఎంతో దోహదపడుతాయని డీడబ్ల్యూఓ సుధారాణి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో బీసీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు, చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు పట్టించాలని సూచించారు. బిడ్డకు ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు తాగించాలన్నారు. అనంతరం అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకటేశ్వరి, అరుణ, పోషణ్ కో ఆర్డినేటర్ రఘునాథ్‌రెడ్డి, నరేష్ తదితరులు ఉన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన ముఖ్యమైనది

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం సామూహిక అన్నప్రాసన నిర్వహించారు. రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, కైలాస్ సత్యర్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ప్రతినిధి లత, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రూతమ్మ, సూపర్‌వైజర్ స్వర్ణలత, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కేటీదొడ్డి: తల్లిపాలు అమృతంతో సమానమని అంగన్‌వాడీ టీచర్ కవిత అన్నారు. శనివారం మండలంలోని గువ్వలదిన్నె కేంద్రంలోని తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

ధరూరు: పిల్లలకు అన్నింటికంటే తల్లిపాలే శ్రేష్ఠం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, పిల్లలు హాజరయ్యారు. 2 ఏళ్ల వరకు తల్లి పాలు బిడ్డకు పట్టాలన్నారు. అనంతరం ఆరు నెలలు పూర్తయిన చిన్నారులకు సామూహిక అన్నప్రాసన నిర్వహించారు.



ధరూరులో..

అలంపూర్ రూరల్: పట్టణంలోని రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అన్నప్రాసన నిర్వహించారు. సూపర్‌వైజర్ జయమ్మ, టీచర్లు ఏమెలమ్మ, నర్మద, మాధవి, పుష్పవతి, శాంతమ్మ, రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: బిడ్డకు తల్లిపాలు బలాన్ని ఇస్తాయని ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత తెలిపారు. శనివారం మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. సూపర్‌వైజర్ ఆస్మా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని మిట్టదొడ్డిలో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సూపర్‌వైజర్ వాసంతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.



శాంతినగర్‌లో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న వైద్య సిబ్బంది



గద్వాలలో..

జోరుగా వరి నాట్లు



కేటీదొడ్డిలో వరినాట్లు వేస్తున్న రైతులు

- వర్షాలు పడటంతో రైతుల ఆనందం
- పనుల్లో నిమగ్నమైన రైతులు, కూలీలు

కేటీదొడ్డి: ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు పడుతుండటంతో జూరాల ప్రాజెక్టుకు వరద వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్టు నుంచి ర్యాలంపాడు రిజర్వాయర్‌కు నీటిని వదులుతున్నారు. ర్యాలంపాడు నుంచి 90 ప్యాకేజీ కాల్వకు నీరు విడుదల చేయడంతో కేటీదొడ్డి మండలంలోని ఉమిత్యాల, ఉమిత్యాలతండా, కొండాపురం, వెంకటాపురం, గువ్వలదిన్నె, కుచినెర్ల, మైలగడ్డ, రంగాపురం, గంగన్‌పల్లి తదితర గ్రామాల రైతులు పైపులైన్ ద్వారా నీరు పారించికొని వరి సాగుకు సిద్ధం అవుతున్నారు.

ఆరుతడి కంటే వరిపైనే మక్కువ

ఈ సీజన్‌లో రైతులు ఆరుతడి పంటల కంటే వరి సాగుపైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. గతేడాది పత్తి, మిరప ఎక్కువగా సాగు చేశారు. మిరప పంటలకు సరైన ధర లేకపోవడంతో చాలా మంది కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసుకున్నారు. వరి పంటలకు మంచి ధర లభించడంతో ఈ సారి చాలామంది రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలో గతేడాది 13వేల ఎకరాలలో వరి సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే చాలా మంది రైతులు వరి సాగుచేశారని, వర్షాలు విస్తారంగా పడుతుండడంతో ఇంకా చాలా మంది సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. కాల్వల ద్వారా నీరు అందుబాటులో ఉన్న వారితో పాటు, బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేసే రైతులు కూడా ఎక్కువ శాతం వరి సాగు చేస్తున్నారు.

పంటకు ఇబ్బంది లేదు



ఈ సీజన్‌లో ముందుగానే వర్షాలు ఎక్కువగా పడుతున్నాయి. ర్యాలంపాడు నుంచి కాల్వలకు నీరు వస్తుండటంతో పంట చేతికి వచ్చే వరకు సాగునీటిని ఇబ్బంది ఉండదు. ధరలు కూడా ఎక్కువగా ఉండడంతో నాకున్న ఐదు ఎకరాల్లో మొత్తంగా వరి సాగు చేశాను.

– వెంకటప్ప, రైతు, కేటీదొడ్డి

సూచనలు పాటించాలి



పంటల సాగుపై ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి, తగిన సూచనలు తీసుకోవాలి. బోర్లపై ఆధారపడి పంటలు వేసుకునే రైతులు అందుబాటులో ఉన్న నీటిని సరిపడే విధంగా సాగు చేసుకోవాలి. ఎందుకంటే పంట చివరి దశకు వచ్చే సమయానికి వర్షాలు తగ్గిపోతాయి. ఆ సమయంలో సాగునీరు అందకపోతే పంట ఎండిపోయి నష్టపోవాల్సి వస్తుంది.

– మహాలక్ష్మి, ఏఓ, కేటీదొడ్డి

జాగ్రత్తలు పాటించాలి

వర్షాకాలం వేసే వరి పంటనే ఎక్కువగా కాండం తొలుచు పురుగు ఆశిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ పురుగు ఆశించకుండా వరి నాటిన 20 నుంచి 25 రోజుల్లో పంట పొట్ట దశలో, ఎకరానికి కార్బస్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు ఎకరాకు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 60 మిల్లీలీటర్ల పిచికారి చేయాలని సూచిస్తున్నారు. దోమ ఆశించకుండా ఉండటానికి ఎకరాకు ప్రతి దఫాలో 90 కిలోల యూరియాను మించి వాడొద్దని చెబుతున్నారు. ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచిస్తున్నారు.

దేవరచెరువులో మొసలి కలకలం



మల్దకల్ దేవర చెరువులో కనిపిస్తున్న మొసలి

మల్దకల్: మండల కేంద్రంలోని ఆదిశిలాక్షేత్రం సమీపంలో ఉన్న దేవర చెరువులో మొసలి కలకలం రేపింది. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా కాల్వకు నీరు వదలడంతో దేవర చెరువు అలుగు పారుతోంది. కాగా శనివారం చెరువులోని బండరాయిపై మొసలి కనిపించడంతో రైతులు, గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. చెరువు పరిసరాల్లో ఎవరూ సంచరించవద్దని ఈ మేరకు అధికారులు సూచించారు. గతేడాది సైతం ఈ చెరువులో మొసలి కనిపించడం గమనార్హం. కాగా మొసలిని తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.